నీళ్లొస్తున్నాయి.. మరమ్మతులేవీ!

- ఆర్‌- 9 ఎత్తిపోతల పథకం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ
- మరమ్మతులకు నిధులు మంజూరైనా విడుదలలో జాప్యం
- ఎడమ కాలువకు నీరొస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో రైతాంగం


ఆర్‌- 9 ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు

మునగాల : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండి ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతాంగం సంతోషపడుతున్నారు. కానీ మునగాల మండల పరిధిలోని ఆర్‌- 9 ఎత్తిపోతల పథకం కింద సాగు చేపట్టే ఆయకట్టు రైతాంగం మాత్రం నిరాశలోనే ఉన్నారు. సాగుకు నీళ్ల విడుదలైనా కూడా ఆర్‌-9 లిఫ్ట్‌కు చేపట్టాల్సిన మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోడంతో ఈ ఎత్తిపోతల పథకం కింద గల రైతాంగం ఆయోమయంలో ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ..

సాగర్ ఎడమ కాలువపై మునగాల శివారులో ఉన్న ఆర్‌- 9 ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు గత ఏడాది అక్టోబర్‌లో చోరీకి గురయ్యాయి. 500 కేవీ, 400 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌తో పాటు 800 లీటర్ల ఆయిల్‌ను దుండగులు అపహరించారు. కానీ నేటికీ ఆ ఎత్తిపోతల పథకానికి తిరిగి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయలేదు. గత ఏడాది రెండు సీజన్‌లలో ఎడమకాలువను సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతాంగం పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేయడంతో రైతాంగం వానాకాలం సాగుకు సన్నద్ధం అవుతున్న వేళ ఆర్‌-9 ఎత్తిపోతల పథకం నడిచేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

రూ. 40 లక్షలు మంజూరైనా..

ఆర్‌-9 ఎత్తిపోతల పథకం కింద మండలంలోని మునగాల, కృష్ణానగర్, బరాఖత్‌గూడెం, కోదండ రామాపురం, నడిగూడెం మండలంలోని రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో సుమారు 3,500 ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోదాడ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పద్మావతి ప్రత్యేక చొరవతో జిల్లా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్‌- 9 పథకానికి అవసరమైన మరమ్మతులతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయించారు. కానీ నేటి వరకు ఆ నిధులు విడుదల కాకపోవడంతో ఈ పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చలేదు. రెండు మూడు రోజుల్లో సాగర్‌నీరు ఈ లిఫ్ట్ వద్దకు చేరుకుంటుంది. కావున ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎత్తిపోతల పథకానికి కేటాయించిన నిధులను త్వరితగతిన విడదుల చేసి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలని ఈ పథకం కింద ఉన్న రైతులు కోరుతున్నారు.

మంత్రి ప్రత్యేక చొరవ చూపాలి



బరాఖత్‌గూడెం శివారులో సాగర్ ఎడమకాలువపై ఉన్న ఆర్‌- 9 ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు గత ఏడాది చోరీకి గురయ్యాయి. గత రెండు సీజన్‌లలో ఎడమ కాలువకు నీటి విడుదల లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం పడలేదు. ప్రస్తుతం ఎడమకాలువకు నీటిని విడుదల చేసినందున యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– దేవరం రామిరెడ్డి, రైతు, మునగాల

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి



సాగర్ ఎడమకాలువకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయడం హర్షణీయం. మునగాల వద్ద ఆర్‌- 9 ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

– బొబ్బిలి వెంకట్‌రెడ్డి, రైతు, మునగాల

మంత్రులకు అధికారుల ఘన స్వాగతం


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మోతె : రెవెన్యూ, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ తూర్పు నిర్మలలకు శనివారం మోతె మండలంలోని మామిళ్లగూడెం టోల్ ప్లాజా వద్ద రాష్ట్ర మోతె మండల అధికారులు స్వాగతం పలికారు. కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి కాల్వకు నీటిని విడుదల చేసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో మామిళ్లగూడెం టోల్ ప్లాజ వద్ద ఆగిన వారికి అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు, రైతులకు చేరేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ ఆంజనేయులు, డీపీఆర్‌ఓ రమేష్, డీఈఈ మల్లేష్, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- ఎర్రవరం పీఏసీఎస్‌లో 66 మంది రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపని సిబ్బంది
- రుణమాఫీ కాక రైతుల ఆందోళన

కోదాడరూరల్ : మండలంలోని ఎర్రవరం పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంతో 66 మంది రైతులకు రూ.28 లక్షల రుణమాఫీ కాలేదు. ఎర్రవరం పీఏసీఎస్ పరిధిలోని ఎర్రవరంతో పాటు రామలక్ష్మీపురం, బీక్యాతండాకు చెందిన పదకొండు వందల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. రుణమాఫీకి సంబంధించి రైతుల వివరాలు పంపడంతో మొదటి, రెండో విడతలలో 450 మంది రైతులకు రూ.2 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. మిగిలిన రైతులకు మరో రూ.2 కోట్ల మేర రుణాలు మాఫీ కావాల్సి ఉంది. అయితే రెండు విడతల్లో లక్ష, లక్షన్నర లోపు రుణాలు మాత్రమే ఉన్న పలువురి రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారు బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా పలు కారణాలతో కొందరికి మాఫీ కాలేదని తెలపగా.. 66 మంది రైతుల వివరాలను అసలు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వానికి పంపలేదనే విషయం బయటపడింది. దీంతో శుక్రవారం ఆ రైతులు పీఏసీఎస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అదేవిధంగా శుక్రవారం పీఏసీఎస్ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్న రైతుల వివరాలను పంపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కొందరు డైరెక్టర్లు అనగా మరికొందరు వద్దన్నట్లు తెలిసింది. దీనిపై సీఈఓ హుస్సేన్‌ను వివరగా కోరగా కంప్యూటర్ ఆపరేటర్ అలసత్వంతో 66 మంది రైతుల వివరాలు పంపనిది నిజమేనని, గత రెండు రోజులుగా ఆ రైతుల రుణమాఫీ వివరాలను ఉన్నతాధికారులను అందజేశామని, వారికి కూడా రుణమాఫీ జరిగేటట్లు చూస్తామని ఆయన తెలిపారు.

అలుపెరగని పోరాటంతో ఎస్సీ వర్గీకరణ

- మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం.. ప్రధాని మోదీ సహకారంతో ఎస్సీ వర్గీకరణపై విజయం సాధించారని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకై పోరాటం చేసిన మంద కృష్ణకు, ఎస్సీ సామాజిక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. మొదట రేషన్ కార్డుతో సంబంధం లేదని చెప్పి, రేషన్ కార్డునే ఆధారం చేయడంతో నిజమైన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతుల తరుపున బీజేపీ పోరాటం చేస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ కాని వారి కోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 8886100097 ఏర్పాటు చేశారని, రైతులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. హుజూర్‌నగర్‌లో స్యాండ్, ల్యాండ్‌తో పాటు అక్రమ రేషన్ దందా యథేచ్ఛగా నడుస్తోందని ఆరోపించారు. చెరువుల్లో మట్టిని అక్రమంగా తరలించడంతో చెరువుల మనుగడ కష్టమైందని, మత్స్యకారులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఈ విషయాలపై మంత్రి ఉత్తమ్ స్పందించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుడు కె.కోటిరెడ్డి, ఇంటి రవి నాయకులు సోమిరెడ్డి, జనిగల శ్రీనివాస్, బెల్లంకొండ నాగరాజు, వెంకట శివ, హిందూజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం


మునగాల : నర్సింహులగూడెంలో అన్నప్రాసన నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

హుజూర్‌నగర్ : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీడీపీఓ వెంకటలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ కళ్యాణి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రం- 1లో ప్రపంచ తల్లిపాల వారోత్సవం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాల ప్రాముఖ్యతను వారు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సీహెచ్.సౌజన్య, సూపర్‌వైజర్ సోమమ్మ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రాజేష్, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అన్నప్రాసన..

పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు – 2, 5 లలో శనివారం తల్లిపాల వారోత్సవం, శిశువులకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. కౌన్సిలర్ కె.విజయ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మునగాల మండలంలోని నర్సింహులగూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రం- 1లో శనివారం అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సృజనారాణి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్.ఉదయ్‌కుమార్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు అరవింద్, బాలు, ఏఎన్‌ఎంలు కె.పద్మ, పావని, బి.పద్మ, ఆశావర్కర్లు లక్ష్మి, సుధ, ఆయా పి.అనసూర్య, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండల ప్రత్యేక అధికారిగా రాంచందర్‌రావు


రాంచందర్‌రావును సన్మానిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా యువజన క్రీడల అధికారి జి. రాంచందర్‌రావు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ జగదీష్, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం


రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

నడిగూడెం : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎస్‌ఐ అజయ్‌కుమార్‌తో పాటు పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ చైర్మన్ మేకల వీరబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం మల్లేష్, వల్లెపు శ్రీను, ఎలకా రామిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భోనగిరి ఉపేందర్, గునుగుంట్ల లింగరాజు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

నోట్ బుక్స్ అందజేత


విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న దాతలు

గరిడేపల్లి : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిలకర వీరస్వామి, ప్రధానోపాధ్యాయులు పిట్ట వీరస్వామి అన్నారు. శనివారం పెంచికల్‌దిన్నెకు చెందిన బుర్రి శేఖర్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో గరిడేపల్లి మండలంలోని వెంకట్రాంపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పిట్ట వీరస్వామి, ఉపాధ్యాయులు కవిత తదితరులు పాల్గొన్నారు.

రుణాల చెక్కుల అందజేత


రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రుణమాఫీ అయిన పలువురు రైతులకు శనివారం కోదాడ పీఏసీఎస్‌లో నూతన రుణాల చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. వైస్ చైర్మన్ బుడిగం నరేష్, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగలక్ష్మి, దశరథ, తిరుపయ్య, కాకుమాను వెంకట్‌రెడ్డి, విజయమ్మ, ఉపేందర్, నరసింహారావు ఉన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


యరగొర్ల గంగయ్య

పాలకవీడు : అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శనివారం నేరేడుచర్లలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన యరగొర్ల గంగయ్య(41) పాలకవీడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా నేరేడుచర్లలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు శనివారం అకస్మాత్తుగా బీపీ పెరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో ఆయన భార్య నేరేడుచర్లలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం సజ్జాపురానికి తీసుకెళ్లారు. ఆయన మృతితో గ్రామంలో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆదివారం గంగయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అవయవ దానంతో మరొకరికి పునర్జన్మ

హుజూర్‌నగర్ : అవయవదానం చేయడం ద్వారా మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రియాంక అన్నారు. అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని కళాశాలలో వాసవీ క్లబ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ అవయవదాన సంఘం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కన్వీనర్లు ఉప్పల రామ్‌నరేష్, ఎం.విజయ భాస్కర్, స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు స్వామి, గోపి, సతీష్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు, భవనాల శాఖ ఏఈఈగా నాయిని ప్రీతి


నాయిని ప్రీతి

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువతి ప్రభుత్వ కొలువు సాధించింది. నాయిని సైదులు- మణెమ్మ దంపతుల కుమార్తె నాయిని ప్రీతి టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో రోడ్డు, భవనాల శాఖలో ఏఈఈగా ఎంపికైంది. ప్రీతి పాఠశాల విద్యను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తి చేసింది. హైదరాబాద్‌లో పాలిటెక్నిక్, అరోరా కళాశాలలో బీటెక్ చేసింది. ఈ సందర్భంగా ప్రీతిని తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

పంచాయతీరాజ్ ఏఈఈగా మునగాల వాసి ఎంపిక


తులసిప్రియ

మునగాల : టీజీపీఎస్సీ శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో మునగాల మండల కేంద్రానికి చెందిన తంగెళ్ల లోకేష్ -మీనాక్షి దంపతుల కుమార్తె తులసిప్రియ పంచాయతీరాజ్ శాఖ ఏఈఈగా ఎంపికైంది. తులసిప్రియ హైదరాబాద్‌లోని జెఎన్టీయూలో ఇంజనీరింగ్, వరంగల్ నీట్‌లో ఎంటెక్ పూర్తిచేసింది.

పీఆర్ ఏఈఈగా మహేష్


పుట్టా మహేష్

నడిగూడెం : మండలంలోని బృందావనపురంనకు చెందిన పుట్టా మహేష్ ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌ను ఆ గ్రామ పెద్దలు, స్నేహితులు అభినందించారు.

తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం


ఇందుకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పాలకవీడు : టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో పాలకవీడు మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన గాదె ఇందు తొలి ప్రయత్నంలోనే పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించింది. ఇందు ఉద్యోగం సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు గాదె సుజాత, నాగరాజులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మునగాల : మండలంలో తొమ్మిది మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ మూడు రోజుల క్రితం జిల్లా అధికార యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. సీతానగరంలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి డి.శ్వేతను బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీకి, కృష్ణానగర్ కార్యదర్శి నర్రా అనితను జగన్నాథపురంనకు, తిమ్మారెడ్డిగూడెం నుంచి సీహెచ్.నవితను సీతానగరంనకు, జగన్నాథపురంలో విధులు నిర్వర్తిస్తున్న ఎండీ.జావిద్‌ను తిమ్మారెడ్డిగూడెంకు బదిలీ చేశారు. కృష్ణానగర్ గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా డి.సైదులు, మునగాలకు టి.చంద్రశేఖర్, నర్సింహులగూడెం గ్రామానికి ఆర్.ఉదయ్‌కుమార్, తాడువాయి గ్రామానికి డి.రామునాయక్ బదిలీపై వచ్చారు. కాగా గతంలో బరాఖత్‌గూడెం గ్రామ కార్యదర్శిగా ఉన్న జి.వెంకటేశ్వర్లు బదిలీపై కోదాడ మండలం దొరకుంట, నర్సింహులగూడెం కార్యదర్శి డి.సత్యనారాయణ చిలుకూరు మండలం బేతవోలు, తాడువాయి కార్యదర్శి ఏ.సతీష్ అనంతగిరి మండలం శాంతినగర్‌కు బదిలీ అయ్యారు. మండలానికి బదిలీపై వచ్చిన కార్యదర్శులు ఆయా గ్రామ పంచాయతీల్లో విధుల్లో చేరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి, తదితరులు

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి సీహెచ్.సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు నవనామి కన్‌స్ట్రక్షన్ వారి సహాయంతో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వాలు క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని, విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే స్పోర్ట్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. హెచ్‌ఎం డి.వెంకటేశ్వర్లు, పీడీలు జి.కొండల్‌రావు, కె.బ్రహ్మారెడ్డి, జి.రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రేపటి నుంచి 'స్వచ్ఛదనం- పచ్చదనం'


చిలుకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాబు

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శిరీష, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ తెలిపారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంమగా పరిసరాల పరిశుభ్రత పాటించి ఇళ్లల్లో, పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దార శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీఓ శైలజ, ఏపీఎం నగేష్, పంచాయతీ కార్యదర్శులు డి.శ్వేత, టి.చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారగాని కృష్ణవేణి, దొంతిరెడ్డి సులోచన, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గరిడేపల్లి : ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించబోయే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్ ప్రసాద్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య, కుక్కల బెడద నివారణపై ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, బిల్ కలెక్టర్లు సతీష్, వెంకన్న, నర్సిరెడ్డి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనంను జయప్రదం చేయాలి

మఠంపల్లి : గ్రామాల్లో ఈనెల 5వ తేదీ నుంచి 9వరకు నిర్వహించబోయే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయితీ కార్యదర్శులు అన్నారు. శనివారం చౌటపల్లి, రఘునాథపాలెం, మట్టపల్లి, బక్కమంతులగూడెం తదితర గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వారు మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా, విద్యుత్, మురికి కాలువల శుభ్రం తదితర పనులు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, నారమ్మ, చంద్రశేఖర్, అంగన్‌వాడీలు, ఆశా వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : గ్రామాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించబోయే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శనివారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటాలన్నారు. మండల ప్రత్యేక అధికారి రామ్‌చందర్‌రావు, ఎంపీఓ జగదీష్, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ధర్మయ్యగౌడ్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్యతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ మాదవీరచంద్ర బృందం 150 మంది మహిళలకు గర్భకోశ వ్యాధి, కడుపులో మంట, బొబ్బలు, నెలసరి తదితర వ్యాధులకు చికిత్స చేసి మందులు అందజేశారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొత్తా కళావతి బృందం, నాయకులు నిజాం, పకీరా, సత్యనారాయణచార్యులు, నరసింహారావు, పాపారావు, అక్బర్, నాగేశ్వరరావు, బుడేసా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, జేపీ మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుడు మేళ్లచెరువు రవి విధుల్లో ఉండగా మృతి చెందాడు. శనివారం రవి మృతదేహంపై పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అదేవిధంగా రవి మృతి పట్ల టీఎన్టీయూసీ నాయకులు సంతాపం తెలిపారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

హుజూర్‌నగర్ : కేరళలోని వయనాడ్‌లో బాధితుల సహాయార్థం హుజూర్‌నగర్‌లో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.14,850 ను బాధితులకు పంపినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, పి.హుస్సేన్, శీలం శ్రీను, పి.వెంకటనారాయణ, టి.యోన తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : వాయనాడ్‌లో భారీ వర్షాలకు నష్టపోయిన బాధితుల సహాయార్థం మండల కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు శనివారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, గుండు సైదులు, వెంకటేశ్వర్లు, రాము, నాగు పాల్గొన్నారు.

స్వర్ణప్రాసన మందు పంపిణీ


చిన్నారులకు స్వర్ణప్రాసన మందు వేస్తున్న డాక్టర్

కోదాడరూరల్ : 16 సంవత్సరాలలోపు పిల్లలకు రోగ నిరోధక శక్తి పెంచేందుకు స్వర్ణప్రాసన మందు ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్యులు సురేష్ జకోటియా అన్నారు. పుష్య నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణ పరిధిలోని తమ్మరలోని ఆయుర్వేద వైద్యశాలలో వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు స్వర్ణప్రాసన ఔషధాన్ని పంపిణీ చేశారు. డాక్టర్లు వంగవీటి భరత్‌చంద్ర, గడ్డం లక్ష్మీప్రసన్న, అనంతచక్రవర్తి, పబ్బా గీత, యాధారాణి. చక్రశ్రీ, మేఘనాథ్, భరత్, నిఖిల్, అఖిల్ ఉన్నారు.

దాతల సహకారం మరువలేనిది


పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న దాత

అనంతగిరి : దాతల సహకారం మరువలేనిదని రంగయ్యగూడెం ఎంపీపీఎస్ హెచ్‌ఎం రామినేని సతీష్ అన్నారు. శనివారం పాఠశాలకు దాత యెన్నం విజయ్‌భాస్కర్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం టేబుల్, చైర్స్, రెండు ఫ్యాన్లు, విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

నాగిరెడ్డికి నివాళి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కొప్పుల నాగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం నిర్వహించిన ఆయన సంతాప సభలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు సాముల హనుమారెడ్డి, రామిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపి ఉన్నారు.

బదిలీపై వెళ్లిన సబ్ ట్రెజరీ అధికారికి సన్మానం

కోదాడరూరల్ : పట్టణంలోని ఎస్‌టీఓ కార్యాలయంలో సబ్‌ట్రెజరీ అధికారిగా పనిచేస్తూ సూర్యాపేటకు బదిలీపై వెళ్లిన వెంకన్నకు స్థానిక కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ఎం.ఎ షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో నూతన ఎస్టీఓ శ్రీనివాసరావు, సిబ్బంది బలరాం, సతీష్, రమాదేవి, సుజాత, సాజిద్‌బాబా, సామ్రాజ్యం తదితరులు ఉన్నారు.

18న కోదాడలో ముత్యాలమ్మ పండుగ

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ముత్యాలమ్మ తల్లి (శ్రావణమాస బోనాలు) పండుగను ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ కమిటీ, రైతు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వట్టివేళ్ల రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పార సీతయ్య, చింతలపాటి సైదయ్య, వేముల రాముడు, కోట వెంకటేశ్వరరావు, గుండెల సూర్యనారాయణ, గంధం పాండు, నాగయ్య, మురళి, వెంకయ్య ఉన్నారు.

దశరథ మృతి సీపీఎంకు తీరని లోటు

మునగాల : మండలంలోని కొక్కిరేణికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ముంత దశరథ(55) మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం దశరథ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ములకలపల్లి రాములు, షేక్ సైదా, పోటు పుల్లయ్య, సైదులు, రావులపెంట వెంకన్న, బ్రహ్మం, లింగయ్య, శంభయ్య ఉన్నారు.